క్లుప్తంగా

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి తెలిపారు. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్ల నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుండి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అలాగే నూతనంగా డయాలసిస్ సెంటర్ ప్రారంభించడం జరిగిందని, కిడ్నీ సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

పులివెందుల రూరల్ : పట్టణంలోని లయోలా డిగ్రీ కళాశాల, బెస్తవారిపల్లె, ఎర్రగుడిపల్లె, పెద్దరంగాపురం, ఆర్.తుమ్మలపల్లె గ్రామాల్లోని 33/11 కె.వి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాలలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ రమేష్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలి



నల్లపురెడ్డిపల్లె పీహెచ్‌సీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పులివెందుల రూరల్ : గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం నల్లపురెడ్డిపల్లెలో ఆయన పర్యటించి మాట్లాడారు. గ్రామంలో రోడ్డుకిరువైపులా ఉన్న చెత్తాచెదారాలను తొలగించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అలాగే కుళాయిల ద్వారా నీరు రోడ్లపై ప్రవహించకుండా చర్యలు చేపడతామన్నారు. అనంతరం ఆయన పీహెచ్‌సీ సమీపంలోని ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా కన్వీనర్‌గా శివ



వేంపల్లి: ఆంధ్రప్రదేశ్ నాయిబ్రాహ్మణ సేవా సంఘం జిల్లా కన్వీనర్‌గా గండికోట వెంకటశివను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నాయీ బ్రహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముసిడిపల్లె రమణ తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ కమిటీ సమావేశంలో వేంపల్లెకు చెందిన శివను ఎన్ను కుని నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ నాయిబ్రాహ్మణు ల సంక్షేమం కొరకు తమ వంతు కృషి చేస్తానన్నారు.

గండి క్షేత్రంలో అంజన్న గ్రామోత్సవం

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో గురువారం విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దేవస్థాన సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, చైర్మన్ కావలి కృష్ణతేజ ఆధ్వర్యంలో అర్చకులు కేసరి, రాజాస్వామిలు వీరాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వీరన్నగట్టుపల్లె గ్రామం వరకు పురవీధులు మీదుగా బాణా సంచా పేలుళ్లు, డప్పు వాయిద్యాల మధ్య గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంజన్నకు ప్రతి ఇంటి నుంచి భక్తులు టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

గృహోపకరణాల పంపిణీ



దివ్యాంగులకు గృహోపకరణాలు పంపిణీ చేస్తున్న మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ చిన్నప్ప

పులివెందుల టౌన్ : పట్టణంలోని పాత మార్కెట్ ఆంజనేయస్వామి గుడి వద్ద వైఎస్సార్‌సీపీ నూర్ బాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఓ.రసూల్ మనవరాలు ఓతూరు హైరా పుట్టినరోజు సందర్భంగా పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని స్థానిక వికలాంగుల కమ్యూనిటీ భవన్‌లో దివ్యాంగులకు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప గృహోపకరణాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు హాలు గంగాధర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ ఉపాధ్యక్షుడు, కౌన్సిలర్ పార్నపల్లె కిశోర్, మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ సర్వోత్తమ రెడ్డి, ఆలయ చైర్మన్ సుధీకర్ రెడ్డిలు హాజరై పేద ప్రజలకు భోజనాన్ని వడ్డించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జయములివ్వమ్మా.. జగజ్జనని

- కన్నుల పండువగా గ్రామోత్సవం
- ముగిసిన దసరా ఉత్సవాలు



పులివెందుల : విజయలక్ష్మీదేవి అలంకారంలో వాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవారు



వేంపల్లె : అమ్మవారి పల్లకి సేవలో భక్తులు



లింగాల : కోలాట ప్రదర్శనలో కళాకారులు (ఇన్‌సెట్) అంబకపల్లె గంగమ్మదేవత



కమలాపురం : వసంతోత్సవంలో పాల్గొన్న ఆర్యవైశ్య బృందం

పులివెందుల టౌన్ : పట్టణంలోని అమ్మవారి ఆలయాలలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురష్కరించుకుని గురువారం వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీ మాత, అంకాలమ్మ ఆలయంలో అంకాలమ్మ అమ్మవార్లు శ్రీవిజయలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. విజయములు చేకూర్చుమా విజలక్ష్మీదేవి అంటూ భక్తులు అమ్మలగన్న అమ్మను వేడుకున్నారు. పార్నపల్లె రోడ్డులోని సాయిబాబా ఆలయంలో షిర్డిసాయిబాబా గ్రామోత్సవం నిర్వహించారు. అంకాలమ్మ అమ్మవారు గ్రామోత్సవాన్ని కేరళ వాయిద్యాల మధ్య వైభవంగా నిర్వహించారు. అమ్మవారిశాలలో కేరళడప్పు వాయిద్యాలు, డీజే, కోలాటం మధ్య పట్టణంలో అమ్మవారి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం వసంతాలు నిర్వహించారు. రాత్రి అమ్మవారి పొన్పు సేవ కార్యక్రమంతో దసరా ఉత్సవాలు ముగిశాయి.

కమలాపురంలో..

కమలాపురం : పట్టణంలో వెలసిన అమ్మవారిశాలలో అమ్మవారు విజయలక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిచ్చి భక్తులను కనువిందు చేశారు. శుక్రవారం అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పొన్పుసేవ నిర్వహించారు. శుక్రవారం తెల్లవారు జామున వరకు అమ్మవారిని ప్రత్యేక వాహనంలో ఊరేగింపు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు సాయినాథ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పట్టణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు.

లింగాలలో..

లింగాల : లింగాల, అంబకపల్లె, పార్నపల్లె, పెద్దకుడాల గ్రామాల్లోని అమ్మవారి దేవాలయా ల్లో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారు రాజరాజేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. చెక్క భజనలు, కోలాటాలు అలరించారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : స్థానిక శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారు సాయంత్రం మంగళవాయిద్యాల నడుమ శమీ దర్శనానికి తరలివెళ్లింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని శమీ దర్శనానికి వెళ్ళారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : పాతూరు, కొత్తూరు చౌడేశ్వరిదేవి, గ్రామ దేవత పెద్దమ్మ తల్లి ఆలయాల్లో దసరా పండుగను పురస్కరించుకుని గురువారం అమ్మవార్లు శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారు సతీసమేతంగా బ్రహ్మరథంపై పురవీధులలో కలియతిరిగారు. మహిళల కోలాట ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది.

వేములలో..

వేముల : గొల్లలగూడూరు గ్రామంలోని శ్రీనల్లనమ్మ ఆలయంలో గురువారం అమ్మవారు శ్రీవిజయలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు నల్లనమ్మ అమ్మవారిని దర్శించుకుని కాయకర్పూరాలు సమర్పించారు.

వేంపల్లెలో..

వేంపల్లె : స్థానిక మెయిన్ బజార్‌లోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో దసరా ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. మహిళా మండలి ఆధ్వర్యంలో వాసవీ మాతకు నక్షత్ర హారతితోపాటు 5 రకాల హారతులు ఇచ్చారు. ఉత్సవాల్లో చివరి రోజు కావడంతో సాయంత్రం శమి దర్శనంలో శ్రీవిజయలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. అలాగే ఆలయంలో రాత్రి వాసవీమాతకు పొన్పుసేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, మహిళా మండలి, అవోపా, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. అలాగే విజయదశమి పురస్కరించుకుని గురువారం స్థానిక వృషభాచలేశ్వర స్వామిని వైభవంగా ఊరేగించారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : పొలతల క్షేత్రంలో, వెల్లటూరులో అమ్మవారి గ్రామోత్సవం వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. పొలతలలో ఆలయ ఈఓ క్రిష్ణానాయక్ ఆధ్వర్యంలో గుడి చుట్టు అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : పట్టణంలోని నాగులకట్ట చౌడేశ్వరిదేవాలయం వద్ద జ్యోతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. మొత్తం 40వరకు జ్యోతులకు తొగటవీర క్షత్రియులు ఆధ్వర్యంలో తయారు చేశారు. పట్టణంలోని ముద్దనూరు రోడ్డు సాయిబాబా ఆలయం ప్రాంగణంలో ఉన్న రాజరాజేశ్వరిదేవి అమ్మవారిని తొట్టి మెరవని నిర్వహించారు. కన్నెలూరులోని రామలింగ చౌడేశ్వరిదేవి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని తలపనూరు గంగమ్మ, గడ్డంవారిపల్లె రాజరాజేశ్వరీ దేవి, ఉరుటూరు చౌడమ్మ, కీర్తిపల్లె నల్లనమ్మ, అనిమెల బోగాదమ్మ, సంగమేశ్వరాలయంలో దసరా ఉత్సవాలు శుక్రవారం వసంతోత్సవంతో ఘనంగా ముగిశాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : పట్టణంలోని శ్రీమత్ కన్యకాపరమేశ్వరీ ఆలయం, శ్రీ ఏరువాక గంగమ్మతల్లి ఆలయం, శ్రీ అంకమ్మతల్లి ఆలయాలలో అమ్మవార్ల శమీ వృక్ష దర్శనం ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్‌యార్డులోని జమ్మిచెట్టు వద్దకు వెళ్లి పూజలు చేశారు. భక్తులు అమ్మవార్లను ఊరేగింపు నిర్వహించారు. సీఐ విశ్వనాథ్‌రెడ్డి బందోబస్తు నిర్వహించారు.



వేంపల్లె : పొన్పుసేవలో వాసవీమాత



కమలాపురంలో విజయలక్ష్మీ అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు



వీరపునాయునిపల్లె : గడ్డంవారిపల్లెలో శమీ దర్శనానికి వెలుతున్న రాజరాజేశ్వరీ దేవి



సింహాద్రిపురం : శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



వేముల : శ్రీవిజయలక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిస్తున్న నల్లనమ్మ అమ్మవారు



పెండ్లిమర్రి : పొలతలలో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



ఎర్రగుంట్ల : భక్తులను అలరించిన కోలాట బృందం



ఎర్రగుంట్ల : శమీ వృక్ష దర్శనంకు వెళ్తున్న శ్రీ ఏరువాక గంగమ్మతల్లి



జమ్మలమడుగు : జ్యోతి ఉత్సవాలలో భాగంగా జ్యోతులను ఎత్తుకుంటున్న భక్తుడు

టెంకాయల వేలం పాట వాయిదా

వేంపల్లె : రాయలసీమలో ప్రసిద్ధిగాంచిన శ్రీ గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో శుక్రవారం దేవస్థానం సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, జిల్లా దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య, ప్రధాన అర్చకులు కేసరి ఆధ్వర్యంలో నిర్వహించిన టెంకాయల వేలంపాట వాయిదా పడింది. ఈ వేలంపాటలో పాల్గొనేవారు
రూ.10 లక్షలు దరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొన్నారు. బహిరంగ వేలం కాల పరిమితి ఒక సంవత్సరం 01- 11- 25 నుండి 31-10- 26 వరకు వేలంపాట నిర్వహించారు. గత ఏడాది రూ.80 లక్షలు పాట పోవడంతో అక్కడి నుంచే వేలం పాట ప్రారంభించడంతో పాటదారులు ఎవరూ పాట పాడుటకు ముందుకు రాకపోవడంతో దేవస్థాన సహాయ కమిషనర్ టెంకాయలు వేలంపాట వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. తిరిగి మళ్లీ టెండర్లు ఎప్పుడు అనేది పత్రికా ప్రకటన ద్వారా తెలియజేస్తామన్నారు.

ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శతాబ్ది ఉత్సవం



సంఘ శతాబ్ది ఉత్సవంలో పాల్గొన్న స్వయం సేవకులు

చింతకొమ్మదిన్నె : రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ మండల శాఖ ఆధ్వర్యంలో సంఘ శతాబ్ది ఉత్సవం స్థానిక శివాలయంలో జరిగింది. ఈ విజయదశమి ఉత్సవానికి పూర్తి యూనిఫాం ధరించి 100 మందికి పైగా స్వయం సేవకులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వైద్యులు కులాయిసాగర్‌రెడ్డి మాట్లాడుతూ దేశ సేవను తమ పరమావధిగా ఆర్ఎస్ఎస్ భావిస్తుందన్నారు. ముఖ్య వక్త కేశవ్‌జీ, ఆర్ఎస్ఎస్ ప్రాంత సేవా భారతి సంయోజక్ (ఏపీ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ) మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ 1925లో ప్రారంభమై నేటికి 100 సంవత్సరాలు పూర్తయిందన్నారు. 100 సంవత్సరాలలో ఆర్ఎస్ఎస్ సాధించిన విజయాలను తెలిపారు. అనంతరం చౌడేశ్వరి మాత ఆయుధాలకు ఆయుధ పూజ చేశారు. ఈ కార్యక్రమానికి చింతకొమ్మదిన్నె సంఘ మండల ప్రముఖుగా చెన్నంరెడ్డి నాగమల్లారెడ్డి వ్యవహరించారు. ముఖ్యశిక్షకుడిగా లా విద్యార్థి మహేశ్వరరెడ్డి వ్యవహరించారు. ఆర్గనైజర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు రైతులకు లాభదాయకం

పులివెందుల రూరల్ : వ్యవసాయ ఉత్పత్తులపై జీఎస్టీ తగ్గింపుతో రైతులకు లాభదాయకమని వ్యవసాయ శాఖ ఏడీ ప్రభాకర్‌రెడ్డి, జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ రాజశేఖర్‌రెడ్డిలు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక ఆర్డీఓ కార్యాలయం నుంచి పాత బస్టాండు సర్కిల్ వరకు వివిధ శాఖల అధికారులతో కలిసి వారు సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ పరికరాలపైన జీఎస్టీ తగ్గింపుల గురించి, రైతులకు వ్యవసాయ ట్రాక్టర్లు, ట్రాక్టర్ టైర్ల విభాగాలు, డ్రిప్ ఇరిగేషన్, స్పింకర్లు, వ్యవసాయ యంత్రాలు ఇలా 12 రకాల బయో ఫెస్టిసైట్స్‌పై జీఎస్టీ తగ్గించడం రైతులకు ఎంతగానో మేలు జరుగుతుందన్నారు.
కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి, టెక్నికల్ ఏఓ సునీల్‌కుమార్‌రెడ్డి, సర్వీస్ టాక్స్ అధికారులు పుష్పలీల, స్వరాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాత్మా గాంధీ జయంతి వేడుకలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక పాత ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం మహాత్మా గాంధీ జయంతి వేడుకలను వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇంచార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్‌రెడ్డి, మాజీ చైర్మన్ చిన్నప్ప, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లె కిశోర్, కౌన్సిలర్ కోడి రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు రసూల్, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జి వివేక్‌లు హాజరై మహాత్మ గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు.

కార్యక్రమంలో వెంకటసుబ్బయ్య, కో ఆప్షన్ నెంబర్ దాసరి చంద్రమౌళి, రవి, చెన్నూరు కార్తీక్, వీరారెడ్డి, డేనియల్ బాబు, ఫక్రుద్దీన్, శ్రీరాములు, సాయిబాబా, కొత్త రవి, చలపతి, మస్తాన్ వలి, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

వేంపల్లెలో..

వేంపల్లె : మహాత్మ గాంధీ జయంతి సందర్భంగా ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కుమారస్వామిగుప్తా ఆదేశాలతో ఎన్ఎస్ఎస్-6 ప్రొగ్రాం ఆఫీసర్ కోనప్ప ఆధ్వర్యంలో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ట్రిపుల్‌ఐటీ ముఖ్య భద్రతా అధికారి శరవణకుమార్ గాంధీ చిత్ర పటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



గాంధీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, తదితరులు

డాక్టర్ ఈసీ గంగిరెడ్డికి ఘన నివాళి




డాక్టర్ ఈసీ గంగిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు



అంధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీనివాస థియేటర్ సమీపంలో ఉన్న మెకానిక్ శేఖర్ ఆధ్వర్యంలో డాక్టర్ ఈసీ గంగిరెడ్డి 5వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం అంధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు హాలు గంగాధర్‌రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లె కిశోర్, కౌన్సిలర్ కోడి రమణ, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్ సీపీ నాయకులు రసూల్‌లు హాజరై అంధులకు, ప్రజలకు భోజనాన్ని వడ్డించారు. అంతకుముందుగా డాక్టర్ ఈసీ గంగిరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెకానిక్ శేఖర్ ప్రతి ఏడాది అంధులకు అన్నదానం చేయడం గొప్ప విశేషమన్నారు. డాక్టర్ ఇసీ గంగిరెడ్డి చేసిన సేవలు మరువలేనిన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యార్వ వెంకటసుబ్బయ్య, చంద్రమౌళి, కౌన్సిలర్లు ఖాదర్ బాషా, రాజశేఖర్‌రెడ్డి, కో ఆప్షన్ నెంబర్ దాసరి చంద్రమౌళి, శ్రీరాములు, నాగరాజు, ప్రతాప్ రెడ్డి, మోటా రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని స్థానిక గీతామందిరం వద్ద శ్రీవీరానారయణస్వామి అంధుల ఆశ్రమంలో శుక్రవారం జిల్లా చేనేత ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరయ్య ఆధ్వర్యంలో అంధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి సింహాద్రిపురం మండల వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రసూల్, వీరారెడ్డిలు హాజరై అంధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు.

వైద్యుల సమ్మెతో అందనిసేవలు



ముద్దనూరు : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యులు సమ్మెబాట పట్టడంతో రోగులకు వైద్యసేవలు అందడంలేదు. ప్రభుత్వం వైద్యుల సమస్యలను పరిష్కరించకపోవడంతో వైద్యులు విధులకు గైర్హాజరై ఓపీ సేవలను బహిష్కరించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు సమ్మెలో వుండటంతో ఓపీలో స్థానిక వైద్య సిబ్బంది రోగులకు తాత్కాలిక వైద్య సేవలందించారు. ప్రతిరోజూ స్థానిక పీహెచ్‌సీలో సుమారు 130 మందికి సేవలందుతున్నాయి. సమ్మెలో వుండటంతో రోగులు ఇక్కట్లు ఎదుర్కుంటున్నారు.

వార్డుల పెంపుపై అభ్యంతరాలు తెలపండి



వార్డుల సరిహద్దులను వివరిస్తున్న కమిషనర్, టీపీఓ

ఎర్రగుంట్ల : స్థానిక మున్సిపల్ పరిధిలో 27 వార్డుల విభజన సరిహద్దులపై ఎవరికైన అభ్యంతరాలు ఉంటే ఈనెల 6వ తేదీలోపు తెలపాలని మున్సిపల్ కమిషనర్ శేషఫణి తెలిపారు. మున్సిపల్ కౌన్సిల్ సభ భవనంలో శుక్రవారం నిర్వహించిన కౌన్సిల్ అత్యవసర ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కమిషనర్, టీపీఓలు మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో అదనంగా 7 వార్డులను పెంచుతూ సెప్టెంబర్ 23న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఇందుకు సంబంధించిన వార్డుల విభజన సరిహద్దులను గుర్తించామన్నారు. 2025 జనవరి 1వ తేదీ వరకు మున్సిపాలిటీలో 24,997 ఓటర్లు ఉన్నారన్నారు. ప్రతి వార్డులో 850 ఓట్లు తక్కువ కాకుండా 1వ వార్డు నుంచి 27 వార్డులకు సమానంగా పంచి సరిహద్దులు చేసి వార్డు సభ్యులకు అందజేసి వివరించామన్నారు. వార్డు కౌన్సిలర్లు వారి సూచనలు, అభ్యంతరాలు ఈనెల 6వ తేదీ సాయంత్రం 4 గంటల లోగా వ్రాతపూర్వకంగా సమర్పించాలని కోరారు. మున్సిపల్ పరిధిలోని అనధికార ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం జీఓ నెంబరు 134 విడుదల చేసిందన్నారు. అనధికార లేఆవుట్లలో 2025 జూన్ 30వ తేదీకి ముందుగా ప్లాట్లు కొనుగోలు చేసి నమోదు చేసుకున్న వారు ఈ పథకం ద్వారా లబ్ధి పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, వైస్ చైర్మన్‌లు జైబూన్నీసా, చంద్రకళలు, కౌన్సిలర్లు లక్ష్మీదేవి, వెంకటలక్షుమ్మ, ఎరికలరెడ్డి, పెన్నారషీద్, కో ఆప్షన్ సభ్యులు డి.సూర్యనారాయణరెడ్డి, మహమ్మద్ రఫీ, టీపీఓ రమణారెడ్డి, మేనేజర్ పుల్లయ్యలు పాల్గొన్నారు.

స్వదేశీ ఉత్పత్తులనే వాడాలి

వేంపల్లె : విదేశీ ఉత్పత్తులు లేకుండా స్వదేశీ ఉత్పత్తులనే వాడాలని బీజేపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షురాలు సుష్మా తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఆత్మ నిర్భర్ భారత్ అభియాన్ స్వదేశీ ఉద్యమ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వేంపల్లె గ్రామంలోని చాకలి వీధిలో బీజేపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షురాలు సుష్మా ప్రజలతో కలిసి ఇంటింటా స్వదేశీ కార్యక్రమం చేపట్టారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడంతోపాటు ఉత్పాదకులను ఆర్థికంగా స్వావలంబనను సాధించడమే లక్ష్యమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దూర దృష్టితో ఆలోచించి స్వదేశీ ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. స్థానికంగా ఉన్న కళాకారులను, రైతులను, స్థానిక పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ మరింత మెరుగు పడుతుందన్నారు. ఈ స్వదేశీ ఉద్యమ కార్యక్రమానికి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఇంటింటా స్వదేశీ ఊరంతా స్వదేశీ అని తెలుపుతూ కర పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.